# కర్ణుడితో బారతం

ఊరూరికీ ఒక బస్సు... యింటింటికీ ఒక బలుబు!...

అని చెప్పినోళ్లు చెప్పినారు. చెప్పినోళ్లకు వరసబెట్టి దండలేసినోళ్లు ఏసినారు. దండలేస్తా ఉంటే ఒక మోపన చేతులు తట్నోళ్లు తట్నారు.

అది ఒకపూట తిరణాల. తిరణాల అయిపాయ. చెప్పిందంతా కప్పతిని పాయ!

చెప్పిందంతా చేసేటట్టుగావుంటే వాళ్లు నాయకులెట్టవతారు? చెప్పిందంతా చెయ్‌లేదెందుకని నిలదీసి అడిగేటట్టుగా ఉంటే ఈళ్లు ప్రెజలెట్టవతారు?

అందుకే?

ఇప్పటిగ్గూడా రొండుచోట్ల దిగి ముచ్చటగా మూడు బస్సులెక్కితేగాని ఆ మూలకాడు కొంపకు చేరుకోలే డెవుడూ?

ఆడగదా నేను పుట్టింది!

'ఇది మరీ అరుసోద్దింగా ఉండాదే? మూలకాడంటే చీటీ చినిగి పూడ్సినోళ్లంతా కడానచేరుకుండేది ఆణ్ణేగదా? పాయ్ పాయ్ అటుమంటి తావులో పుట్నానంటా ఉండాదే? ఇదేందో ముంతకు చెవులొచ్చిన యవారంగా ఉండాదే?' అంటా ముక్కుమింద ఏలేసుకోబాకండి.

వల్లకాడు గాక యింకా ఆ మూలకాడు కొంపల్లో ఏం మిగిలుండాదిలే?

అదునుకు పదునుబడి వాగిటికి సగంగా పండేటప్పుడే బతుకులు ఆడికాడికి! ఇంక యిప్పుడంటారా? ఈడికందదు. ఆడికి చాలదు. ఆ చాలీచాలని బతుకుల్లో చినకల్లో తడవని చిన్నోళ్లకు చినుకెట్లుంటిందో యివరించి చెప్పలేక చింత చెట్టుకింద యిస్కూల్లో అయ్యోరే చిమిడి చింతకాయంత అయిపోతా ఉండాడంట! ఇంక పైరుపచ్చలమాట చెప్పాల్నా?

పైర్లగెతి పరమాత్ముడెరుగు. మరీ గొడ్డుగోదకంత పచ్చికసువు? యాడుండాది? చినుకు నేల రాల్తేగదా? నేలతల్లి దయతలిస్తేగదా? మొక్కా మోటు యాడిదాడ ఎండకపోతే మాసికలేసిన దుప్పిటితో మూసి పెట్టినట్టు పీడకళ కొట్టావుంటిందాడ!

ఆ వల్లకాట్లోనే పుట్నా. పెద్ద పెద్ద చదువులు చదువుకోవాలనుకుణ్ణా. చదువుకోని ఆ వల్లకాట్లోనే మల్లెలు పుయ్యించాలని మునాసపణ్ణా. తిరపతి చేరుకుణ్ణా. మా యక్కోళ్లింట్లో మకాం పెట్నా. తగిలె. ఏకంగా తిరపతి గాలి తగిలె. ఈగాలి తగిలె ఈ నీళ్ల వొంటబట్టె. ఇప్పుడంటే కల్లాణిడాం నీళ్లగాని అప్పుడు మంగాపరం నీళ్లగదా? ఇంకేముండాది? మా ఊరిమాట గాలి కెగిరిపాయ!

మాయమ్మగాన తలదూర్సకుండా ఉంటే ఈ నాలుగచ్చిరాలుగ్గూడా గెతిలే. పార పట్టుకోవాల్సి నోణ్ణే!

మా యక్క మొగుడు! అదే మా బావ.ఆడి దరమారెడ్డి. వాళ్లతాత పారపట్నాడు. వాళ్ల అయ్యా పారపట్నాడు. దర్మంగా చెప్పాలంటే దర్మారెడ్డిగూడా పార పట్టాల్సినోడే! అయితే దరమారెడ్డి పార పట్టాల్సిన చేత్తో కరిణ పట్తే కల్సి వస్తిందను కుణ్ణాడేమో? కట్టు గుడ్డల్తో కాలు ఎలపెరుక్కొనొచ్చి తరపతి చేర్నాడు.

పార పట్టాల్సిన చేత్తో కలంపట్తే కల్సి వొస్తిందని నేను మా బావ పంచన చేర్నా.

ఇట్టామాదిర కలం పట్టాలని ఒకడు... కరిణ పట్టాలని ఒకడు... తరిణ పట్టాలని యింకొకడు అందురు ఒకడి తోక పట్టుకొని యింకొకడు గొర్రెదాటుగా వచ్చేస్తే ఇంక ఆ పల్లెలో ఎవుడుంటాడు? ఆడ ఏముండాదని ఉంటాడు?

అట్టా వచ్చేసినోళ్లా? వాళ్లకేం? ఈ టవన్లల్లో అంతోయింతో కూడేసు కోని కుదురుగా ఉండారనుకోండి. అదియేరే కత!

ఇంక అసలుకతకాడికొస్తే మా దరమారెడ్డిమామ మాత్రం కరకర పొద్దుమొలస్తా ఉణ్ణా దుప్పిటి ముసుగులో గురక పెట్టావుంటే కానబాయిలో కప్పలు అర్సినట్టుండేది. మా యక్క ఉండాదే? మణిసి శానా ఉసారు. మున్సిపాల్టీవాళ్ల శంకుతో పోటీపడ్తా నిద్దర్లేస్తింది. ఇంటిముందర సుబ్బరంగా చెత్త ఊడిస్తింది. చిక్కంగా కళ్లాపు చల్లింది. అట్టొక కర్ర. ఇట్టొక కర్ర. ముక్కర్రేస్తింది. కుండాచట్టి కడిగేస్తింది. అప్పుడు పొయ్యిమింద అండాలో నీళ్లుపెట్టింది.

అప్పిటిగ్గూడా మాబావ పడకమింద అట్టాయిట్టా పొల్లాడ్తానే ఉంటాడు.

అప్పుడు మాయక్క పొయ్యి ముందర కూసుంటింది. పొయ్యిలోకి కట్టిపుల్లలు ఎగదోస్తా-

''ఏమే? నిద్దర్లేసేది ఉండాదా? లేదా? ఈ పూటగూడా పనికి నాంపెట్నెట్టేనా? అందుకేగదా నీతోగూడా అంటేనా కాదు.కాదు. నీకంటే ఎనక కరిణెపట్నోళ్ల సొంతంగా యిండ్లు కట్టుకోనుంటే మనం యిట్లా బాడిగ కొంపల్లో మల్లగుల్లాలు పడ్తా ఉండేది.'' అంటా యాష్ట బొయ్యేది.

ఆమె అట్టామాదిర యాష్ట పోతావుంటే అతగాడికి దున్నపోతు మింద వాన కుర్సినట్టుంటిం దేమో? నిక్కతా నీలగతా వొళ్లిర్సుకుంటా పైకి లేచి-

'పోతా! పోతానే! నీయాశ ఎందుకు పోవాల్నే? పోతా. ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్ ఆ దింపుడుగళ్లం ఆశగూడా తీర్సుకోని వొచ్చేస్తా!' అనేటోడు.

దింపుడుగళ్లం ఆశ! ఇదేమి ఆశ? ఏందో కొత్తగా ఉండాదే!

ఆ వయసులో నాకు శానాశానా ఆశలుండేవి. శానాబాగా చదువుకోవాలని... పరీచ్చల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని.. అప్పుడడిగితే మంచి మంచి చొక్కాయిలు సొరాయిలు కుట్టిస్తారని. ఎట్టన్నాసరే! మూణ్ణెల్ల పరీచ్చలైపోతానే కొత్తచెప్పులు కొనుక్కోవాలని! యిట్టామాదిరి ఓయబ్బా! అలివిమాలినన్ని ఆశలుండేవి. కానీ దింపుడుగళ్లం ఆశ అంటే అదేందబ్బా అనుకుండేటోణ్ణి!

అదేయిప్పుడు ఆలోచిస్తావుంటే-

అసలు మణిసి ఆశాపాశంలోనే పుట్టా ఉండాడు..

ఆ ఆశాపాశంలోనే పెరగతా ఉండాడు.

పుట్టకతో వచ్చిన బుద్ధి పుడకలతోనే గానీ పోదన్నెట్టు ఈయాశ ఉండాదే? అది మణిసిని చచ్చేదాకా వొదిలి పెట్టేటట్టుగా లేదు. దాని సిగదరగ!... చచ్చేదాకనే కాదు. చచ్చిపొయ్‌నా గ్గూడా వొదిలి పెట్టేటట్టు లేదు.

యాణ్ణోఏమో? ఎవుడోఒకడు. చచ్చిపొయ్‌నాడంట! ఆమాట కొస్తే ఎవుడిక్కడ చావకుండా స్తిరంగా గూటంకొట్టుకోని ఉండబోతాళ్లే?

ఆ శవాన్ని మోసుకోని పొయ్యేదానికని పాడెకట్నారు. పీనిగెను ఆ పాడిమింద పెట్నారు. ఆకట్టెనుగూడా కదలకుండా కట్నారు. నలుగురు నాలుగు చేతులేసి ఎత్తుకోని పొయ్ మట్టికి మరుగు చేసొస్తే పీడొదిలి పోతిందని నలుగురు నాలుగుపక్కల పట్టుకోని వల్లకాటి కాడికి మోసుకొని పొయ్‌నారు. ఆడ దించినారు.

దూరాబారాన్నుండి అయ్‌నోళ్లు పొయ్‌నోళ్లు రాలేదనో... తొవ్విన గుంత లోతు చాల్లేదనో ఎదురు చూస్తా కూసోనుంటే ఉణ్ణెట్టుండి పాడిమింద పీనిగె కదిలిందంట!

మాయదారి గాలి! ఆ కట్టినొదిలి పెట్టేసి చెప్పాసెందకుండా ఎట్టా బొయ్యిందో పొయ్యింది. మల్లా ఎట్టొంచ్చిందో వచ్చేసింది. చచ్చినాడను కుణ్ణోడు లేచి కూసున్నాడు.

ఆ పొద్దుట్నుంచే పాడెదించిన చోటు దింపుడుగళ్ల మయింది!

ఆడదించితే మల్లా బతకతాడేమో అనే ఆశ ఉండాదే అది దింపుడుగళ్లం ఆశ అయింది. ఇది ఎప్పుడు జరిగిందో ఏమో? ఈ పొద్దుటిగ్గూడా ఈ యాశ మణిసిని యిడ్సిపెట్లేదే? సౌశాణం ముందరట్టా దించినట్టు దించి గొంతెత్తి పిల్సి ఆడికి ఆశ వదులుకుంటారు. ముందున్నోళ్లు ఎనక్కు ఎనకున్నోళ్లు ముందుకు మారుకుంటారు. మల్లగదా ఎత్తుకోని పోతారు.

అయితే అవ్వచ్చు. ఈ దింపుడుకళ్లానికి నాలుగ్గాళ్లమండపానికి ఎట్టొచ్చిందబ్బా బొడ్డుకింద చుట్టిరికం అంటే?

తిరపతిలో కూలీనాలీ చేసుకునే వాళ్లందురూ బల్లుమని తెల్లారేకాడికి కండ్లల్లో నిద్దరపెట్టుకునే నాలుగ్గాళ్లమండపం కాడికొచ్చేస్తారు. ఆ పూట పని దొరికితిందనే ఆశతోనే వస్తారు. గీత చక్కంగా ఉండి పనిదొరికితే పోతారు. దొరక్కుండాబోతే చెవులు వాలేసుకోని కొంపలకు పోతాపోతా దింపుడుకళ్లం ఆశ తీరిపొయ్యిందనుకుంటా పోతారు.

ఈ సత్తిం తెల్సుకునేకుందికి యాభైఏండ్లు నెత్తికొచ్చినాయ్ నాకు!

ఈ పొద్దు ఆ నాలుగ్గాళ్లమండపంకాడ నిలబడుకోని దింపుడుగళ్లం ఆశ తీరి పొయ్యిందనుకుంటా తిరిగి తిరిగిచూస్తా కదల్లేక కదిలే ఆ తోలుబొమ్మల్ను చూస్తావుంటే కడుపులో చెయ్యేసి కలబెట్టినట్టుంటింది.

బారెడు పొద్దెక్కితింది. మైలిర్సే కుందికి తూరుపురేకలు మిలమిలా మెరస్తా ఉంటాయి. నాలుగ్గాళ్లమండపంమింద ఎవురెగరేసినారో మువ్వన్నెలజండా! రెపరెపలాడ్తా ఉంటింది. అరెరె! ఉణ్ణెట్టుండి యింత చీగిటి ఎట్టపొయ్యుంటిందబ్బా అనే అనుమానం గలిగి అట్టాయిట్టాచూస్తే ఆచీగిటంతా ఆ మొకాలనిండికి పేరుకొని పొయ్యుంటింది.

ఇంక ఆపూటకు చట్టి పొయ్యిమింది కెక్కేది కల్ల. చట్టి పొయ్యి మింది కెక్కదంటే యింక కడుపులే పొవ్వులవతాయి. అవ్వి మండతాయి. కట్టెకంపా ఎయ్యకపోయ్‌నా బగబగ మండతాయి. ఆ మంటకు తట్టుకోవాలంటే తడిగుడ్డన్నా కడుపుమింద ఏసుకోవాల. తడిగుడ్డ కావాలంటే గుడ్డ తడుపుకోవాలగదా? గుడ్డ తడుపుకోవాలంటే నీళ్లుగావాల్నా? యాడుండాయి నీళ్లు? అవ్వి గుండికాయల్లో ఉండాయి. కావాలంటే కండ్లల్లో కొస్తాయి. పలపల రాల్తాయి. అవ్వి చాల్తాయా? చాలవే? ఈ సీమలో చినుకు రాలేదెప్పుడో? ఈ బతుకులు చిగిరించేదెప్పుడో? అని ఆలోచిస్తా తలకాయి పైకెత్తి చూస్తే ఎవురో ఎంటబడి తరమతావుణ్ణెట్టు ఒక్కో మోపన వస్తా ఉంటాయి మేగాలు.

''అద్దో వచ్చేశా!... యిద్దోవచ్చేశా!... అదెత్తి లోపలబెట్టు... యిదెత్తి పక్కన బెట్టు.'' అంటా మొగోళ్లు గోచిపేత లెగచెక్కతా ఆడోళ్లు పైటకొంగులు నడుపున చెక్కతా

ఉండంగానే ఎట్టబోతాయో పోతాయి ఆ మేగాలు! ఆకాశిం కడిగి తోసినట్టయిపోతింది. ఈదులు మాత్రం ఏనిగిల గుంపులు పడ్తే పలమనేరు చుట్టుపక్కల పల్లెలమాదిర్తో అయిపోతాయి.

ఇస్తే ఎట్టా? ఈకుండా పోతే ఎట్టా? అంటా మల్లగులాలుపడ్తా గుక్కిళ్లు మింగే లోబినాకొడకల మాదిర వచ్చినట్టే పాయ్‌నట్టే యామారిస్తా ఉణ్ణె మేగాలు లోబియదవ బుద్ధిమార్సుకుణ్ణెట్టు ఈ మద్దె ఒకనాడు ఉణ్ణెట్టుండి కమ్ముకుండె. ముసురు యిడవకుండా పట్టుకుండె. ఇంట్లోకాలు యాదిలో పెట్టేదానికి లేకుండాపాయ. కూలీనాలీ చేసుకుండే బీదాబిక్కీకి పనీపాట లేకుండాపాయ. లేకుండా పోతేపాయ్యింది. కార్తీక నెల్లో వానకదా? కన్నూ మిన్నూ తెలవకుండా కురిస్తుందిలే! అనుకుంటా ఉంటే అయిదోనాటికే తెరపిచ్చి పాయ!

ఇదేందిది? ఇట్టగుడ్డ పేలిక తడవలా? అట్టనేల యింకలా? అప్పటికే అల్సిపుల్సి పాయ్‌నట్టు తెరిపిచ్చేసిందే? కురిసిందీ కాక పాయ. కురవన్ది కాకపాయ. వక్కాకు బెట్టి ఎవురోపిల్సినట్టు వొచ్చింది- పనీ పాటా చెడదొబ్బి బీదాబిక్కి కడుపులు కాల్చేదానికి! అనుకుంటా పోతావుంటే నాలుగ్గాళ్లమండపంకాడ ముత్తారెడ్డన్న ఎదురుపడె!

''ఏందన్నా యిది? కొండంత రాగంతీసి తుమ్మదీల పాట పాడినట్టయ్ పాయ్‌నే బతుకు!'' అని అంటే-

''ఒరే అబ్బోడా! యిన్రా యిను. కర్ణుడితో బారతం... కార్తీకి నెల్లోవాన. ఆడికి అయిపాయ్ నట్టే నని పెద్దోళ్లు ఊరికే అన్లేదురా! కర్ణుణ్ణి బెమ్మాండంగా నమ్ముకుంటే కౌరవుల బతుకు ఆడికేడ్సింది. కార్తీకినెల్లో వానను నమ్ముకుంటే మనబతుకులీడికి తెల్లార్నాయి. ఇంక ఈ సీమలో చినుకు రాలేదంటే దింపుడుగళ్లం ఆశేగని నువ్వు పదరా!'' అనె అధొకమాదిరగా నవ్వతానే!

ఇంక కర్ణుడితో బారతం కతగానే ఉండాది ఈ సీమలో బతికేదంటే! ●